

మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

## ప్రజల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 9 : ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సర్వసాధారణమని, ప్రజల తీర్పును శిరసా వహిస్తామని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో పోటీ చేసిందని, పార్టీ తరపున 39 మంది గెలుపొందారని పేర్కొనారు. కష్టపడ్డ చైర్మన్లు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజలను ఓట్లు అడిగామని, ఎక్కడా ప్రతిదాడులకు పాల్పడలేదని పేర్కొన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. నిర్మల్‌లో ప్రజలు ఎన్నో రకాల తీర్పులను ఇచ్చారని, ఎన్నో పర్యాయాలు ఎన్నికలను చూశామని పేర్కొనారు. సోషల్ మీడియాలో తమపై తప్పుడు ప్రచారాలు చేసి ఓట్లను పొందారని, తాము అభివృద్ధిని చూపిస్తూ ప్రజలను ఓట్లు అడిగామని వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పార్టీ మారుతారని వచ్చే పుకార్లను కొట్టిపారేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలుపర్చారని, మిగతా వాటన్నింటినీ అమలుపర్చాలన్నారు. బీఆర్ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్‌ను ఎన్నుకున్నట్లు, ఆయన పిలుపు మేరకు కార్యాచరణ ఉండనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పార్టీ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, నాయకులు జీవన్ రెడ్డి, సుభాష్ రావు, గోవర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యదేవుడి సన్నిధికి భక్తుల తాకిడి



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, డిసెంబర్ 9 : కార్తీక బహుళ ద్వాదశి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి నెలకొంది. పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడిగా మారింది. ముందుగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, కార్తీక దీపాలు వదిలారు. గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింద రావి చెట్టు వద్ద, గుట్టపైన ధ్వజ స్థంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. 486 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. అనంతరం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల కోసం ఆలయ సిబ్బంది రెండు వ్రత మండపాలు ఏర్పాటు చేశారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చిదుర రమేశ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ జైల్, వరంగల్ రేంజ్ సంపత్‌కుమార్ దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ముందుగా వారికి అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈవో సంకటాల శ్రీనివాస్ శేషవస్త్రాలతో సన్మానించారు. అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.

# ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోండి

- మహిళలకు ఆయా జిల్లాల కలెక్టర్ల పిలుపు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ప్రారంభం
- బస్సుల్లో ఫ్రీ జర్నీకి జెండా ఊపి శ్రీకారం



నిర్మల్ అర్బన్ : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఎం, డీటీవో

మంచిర్యాలటౌన్/ గర్మిళ్ల, డిసెంబర్ 9 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను ఆయా జిల్లాల కలెక్టర్లు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉచిత బస్ ప్రయాణం, జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్య శ్రీ సేవలను ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్య సదుపాయం పొందవచ్చునని తెలిపారు. గుర్తింపు పొందిన దవాఖానలో ఆరోగ్యశ్రీ కౌంటర్ ఉంటుందని, అక్కడ ఉన్న సిబ్బందికి తెల్లరంగు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇతర వివరాలు అందించాలని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వమే వైద్యానికి అయ్యే ఖర్చులు భరిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచింతగా ప్రయాణించవచ్చునని తెలిపారు. వారం పాటు ఎలాంటి గుర్తింపు కార్డులు చూపించాల్సిన అవసరం లేదని, తదుపరి నిబంధనలు వచ్చే వరకు ఉచితంగా ప్రయాణించవచ్చునని చెప్పారు. అనంతరం జీరో టికెట్‌ను మహిళలకు అందజేసి, అదే బస్సులో ఆయన కూడా ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఎంసీహెచ్ ఆర్ఎంవో భీష్మ, టీవీవీపీ దవాఖానల జిల్లా సూపరింటెండెంట్ అరవింద్, డీటీవో కిష్టయ్య, ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆదిలాబాద్‌లో..

ఎదులాపురం, డిసెంబర్ 9 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ దవాఖాన ప్రాంగణంలో ఆర్టీసీ బస్సులో మహిళాలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకాలను అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ప్రతి మహిళా ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని సూచించారు. ఆరోగ్య కింద రూ.10 లక్షల వరకు వైద్య సాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం బస్సులో మహిళలు, విద్యార్థినులకు కలెక్టర్ జీరో టికెట్ అందించారు. వారితోనే ప్రభుత్వ దవాఖాన నుంచి మావల చౌరస్తా, తిరిగి కలెక్టర్ చౌక్ నుంచి దవాఖాన వరకు బస్సులో ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప రవాణ అధికారి పుప్పాల శ్రీనివాస్, ఆర్టీసీ ఆర్ఎం సొలెమాన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఆర్ఎంవో డాక్టర్లు ఇద్రిస్‌అక్బానీ, చాంపత్‌రావు, డీఎం కల్పన, మున్సిపల్ కమిషనర్ శైలజ, డీఎస్పీ వీ ఉమేందర్, తలమడుగు జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### ఉట్నూర్‌లో పీవో..

ఉట్నూర్, డిసెంబర్ 9 : ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో మహాలక్ష్మి పథకాన్ని అధికారులతో కలిసి ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ నగేందర్, ఎస్ఐ మనోహర్, మహిళలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

### నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్/నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 9 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని జిల్లా దవాఖాన ఆవరణలో మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పథకాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. బస్సుకు రిబ్బన్ కట్‌చేశారు. బస్సుల్లో జీరో టికెట్, ఆరోగ్య శ్రీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిషోర్, సూపరింటెండెంట్ సునీల్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి, జిల్లా రవాణ శాఖ అధికారి అజయ్ కుమార్ రెడ్డి, వైద్యులు దేవేందర్‌రెడ్డి, రజిని, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, ఆరోగ్య శ్రీ టీం లీడర్ భూంరెడ్డి, వైద్య సిబ్బంది, ఆర్టీసీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్, డిసెంబర్ 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పథకాలను కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణంపై మహిళలతో సిబ్బంది మర్యాదపూర్వంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, చరణ్, మురళి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు

# కమ్ముకున్న పొగ మంచు

- మిగ్‌జాం తుఫాను ప్రభావం
- పెరిగిన చలి తీవ్రత
- ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు

***మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో*** *పల్లెలు, పట్టణాలపై పొగ మంచు కమ్ముకున్నది. ఉదయం 9 గంటల వరకు కూడా వీడకుండా దుప్పటిలా కప్పేస్తున్నది. హెడ్‌లైట్లు వేయనిదే రోడ్డుపై వాహనాలు నడుపలేని పరిస్థితి నెలకొన్నది. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడం, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువ నమోదవుతుండడంతో చలి తీవ్రత కూడా పెరిగింది. దీనికి తోడు శీతల పవనాలతో మరింత వణుకు పుడుతున్నది. మరోవైపు రోజంతా ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజానీకం బయటికి రావాలంటేనే జంకుతున్నది. సాయంత్రమైతే గజగజ వణుకుతున్నది.*


**- ఆసిఫాబాద్ టౌన్/బెజ్జూర్, డిసెంబర్ 9**



బెజ్జూర్ : రోడ్డుపై మసకబారి కనిపిస్తున్న ఎడ్లబండి



బెజ్జూర్ : కుకుడ గ్రామంలో కమ్ముకున్న పొగమంచు



ఆసిఫాబాద్ టౌన్ : లైట్లు వేసుకొని వస్తున్న లారీ



బెజ్జూర్ : కుకుడలో ప్రధాన రహదారిపై పొగమంచు



బెజ్జూర్ : ఉదయం వాకింగ్ చేస్తున్న యువకులు